క్లుప్తంగా

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: మండలంలోని నాగులపాడు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామికి అర్చకుడు త్రినాథ్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్త సమాజం భజన ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

కాకుమాను: స్థానిక శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పంచమ వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే స్వామి ఏకాహం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు తోరణబంధన, అంకురార్పణ, ధ్వజారోహణ, దీక్షధారణ, శ్రీ వీరబ్రహ్మ యజ్ఞం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు స్వామి దివ్య కల్యాణం

శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణాన్ని ఆదివారం కన్నుల పండువలా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్న సంతర్పణ ఉంటుందని, గ్రామస్తులంతా పాల్గొనాలని వారు కోరారు.

పని చేయని వలంటీర్లను తొలగించండి : డీపీవో



ప్రత్తిపాడు: పని చేయని వలంటీర్లను వెంటనే తొలగించి వారి స్థానంలో వేరే వారిని నియమించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి ఆదేశించారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లే అవుట్‌లో శనివారం గృహ నిర్మాణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంలో వలంటీర్లు ఆసక్తిని చూపకపోతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పింఛన్లు ఇవ్వడం మాత్రమే కాదని, ప్రభుత్వం నిర్వహించే ప్రతి సంక్షేమ కార్యక్రమంలోనూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యం చూపుతున్న తొమ్మిది మందిని తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరమ్య పాల్గొన్నారు.

కిట్స్‌లో న్యూస్ లెటర్ ఆవిష్కరణ



వింజనంపాడు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో శనివారం సీఎస్‌ఈ–డీఎస్ విభాగం న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యార్థుల తల్లిదండ్రుల్ని ఆహ్వానించి వారితో ఆవిష్కరణ చేయించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



చేబ్రోలు: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో జలపాటి సుబ్బారావు కొనియాడారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూలు విద్యార్థులకు నెల రోజులుగా తెనాలికి చెందిన విద్యా ప్రదాత చిటుమడుగుల సాంబయ్య స్మారక పరిషత్ సహకారంతో మధ్యాహ్న భోజన సమయంలో ఉచితంగా మజ్జిగను అందజేశారు. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ట్రస్టు తరఫున చల్లా కాశీంరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు, హైస్కూలు కరస్పాండెంట్ గాదె వెంకట సుబ్బారెడ్డి, హెచ్‌ఎం తుర్లపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్మయోగి బాబూ జగ్జీవన్‌రామ్ పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో బాబూ జగ్జీవన్‌రామ్ ఆల్ ఇండియా సమతా మూమెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ శృంగారపాటి ఆనందబాబు రచించిన కర్మయోగి జగ్జీవన్ రామ్ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. సభకు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా ఆనంద్‌బాబు, వర్ల రామయ్య, తెనాలి శ్రావణ్‌కుమార్, న్యాయవాది శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.



కోయవారిపాలెం కల్లాల్లో తడిచిపోయిన పొగాకు



బొర్రావారిపాలెం సమీపంలో మిర్చి కల్లాలపై కప్పిన పట్టలు

వదలని ఈదురుగాలుల బెడద

- నేలకూలిన చెట్లు
- నిలిచిన ట్రాఫిక్
- అకాల వర్షంతో కల్లాల్లో తడిసిన మిర్చి, పొగాకు

ప్రత్తిపాడు: అకాల వర్షం రైతులకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. ఐదు రోజుల కిందట కురిసిన వర్షాలకు కల్లాల్లోని దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ఆ కన్నీటి కష్టాల నుంచి కోలుకోకముందే శనివారం మరలా ఈదురుగాలులతో అకాల వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్ పట్టాలు కప్పుకుని కల్లాల్లోని మిర్చి, పొగాకు తడవకుండా కాపాడుకున్నారు. అకాల వర్షంతో పాటు పెద్దఎత్తున ఈదురుగాలులు వీచాయి. దీంతో ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో భారీ చింత చెట్టు నేలవాలింది. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ సిబ్బందిని పంపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అకాల వర్షంతో రైతులకు అవస్థలు

పెదకాకాని: అకాల వర్షాలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండలంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఊహించని విధంగా వర్షం పడటంతో కల్లాల్లో ఆరుతున్న మిరప, జొన్న, మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు వాటి దగ్గరకు పరుగులు తీశారు. పట్టాలు కప్పి తడవకుండా కాపాడుకున్నారు.



పాత మద్రాసు రోడ్డులో పెద్దఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్



ప్రత్తిపాడులో మిర్చి కల్లం నుంచి నీటిని బయటకు పంపుతున్న దంపతులు



ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో కూలిన భారీ చింతచెట్టు

‘మా నమ్మకం నువ్వే జగన్’ అని చాటిచెబుతున్న ప్రజలు



పట్నంబజారు: రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగన్ అని చాటి చెబుతున్నారని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 27న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29కి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల ఇళ్లలో ప్రజల్ని కలుసుకున్నట్లు చెప్పారు. 1.10 కోట్ల మిస్డ్ కాల్స్‌ను ఇచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిపై వారికి ఉన్న నమ్మకాన్ని తెలియజేశారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 7లక్షల మంది గృహసారథులు, పార్టీ నేతలు ఈ బృహత్తర కార్యక్రమానికి ఎంతో పాటుపడ్డారని, వారందరికీ అభినందనలు తెలియజేశారు. సీఎంగా వై.ఎస్. జగన్ బాధ్యతలు చేపట్టాక రూ. 2లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు మేలు చేసి ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం తెలుస్తోందని, దీనిపై కూడా టీడీపీ నేతలు బురద జల్లే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. 2014 నుంచి 2109 వరకు ప్రజలకు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు ఏదైనా మేలు చేశారా? అని ప్రశ్నించారు. అసలు గడపగడపకు వెళ్లే దమ్ముందా ? అని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలారి రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో సైతం 90శాతం కుటుంబాలు పూర్తయ్యాని, 70శాతం మిస్డ్ కాల్స్ వచ్చాయని చెప్పారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

శివాలయం అర్చకుడిపై కేసు నమోదు

పెదకాకాని: స్థానిక శివాలయంలో అర్చకుల మధ్య చోటు చేసుకున్న వివాదంలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దేవస్థానంలో పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ ప్రధాన అర్చకుడిగా, చదలవాడ జాలయ్య ఉప ప్రధాన అర్చకుడిగా పని చేస్తున్నారు. జాలయ్య పదే పదే ఆలయ అర్చకుల డ్యూటీల విషయంలో జోక్యం చేసుకుని తాను చెప్పిందే చెయ్యాలంటూ వారిని బెదిరిస్తున్నాడు. డ్యూటీల వివాదం భరించలేక విషయం ఆలయ సహాయ కమీషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి వివరించేందుకు ఏప్రిల్ 5న ప్రధాన అర్చకుడు వెళ్లారు. ఈవోతో మాట్లాడుతుండగా అక్కడికి చేరుకున్న జాలయ్య మధ్యలో కలుగజేసుకుని అసభ్య పదజాలంతో ప్రధాన అర్చకుడు వరప్రసాద్‌ను దూషించాడు. కుర్చీ పైకి లేపి అక్కడ సిబ్బంది సమక్షంలోనే చంపుతానని బెదిరించాడు. జాలయ్యను పిలిపించి విచారించి తన జోలికి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాన అర్చకుడు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

నేలలో సేంద్రియ పదార్థంతో అధిక దిగుబడులు

గుంటూరు రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ భూముల్లో సేంద్రియ పదార్థం తప్పనిసరిగా పెంచాలని, దీనివల్ల దిగుబడులు కూడా పెరుగుతాయని రిటైర్డ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె. రామచంద్రం తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో శనివారం సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ గతంలో సేంద్రియ పదార్థం తగిన మోతాదులో అందిస్తూ పంటల సాగు చేపట్టేవారని, దానివల్ల సూక్ష్మజీవుల పెరుగుదలకు అనుకూలమైన వాతావరణం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం నేలలో సేంద్రియ పదార్థం తక్కువైందని, దాన్ని పెంచుకోవడానికి పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు తదితర అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అసిస్టెంట్ డెరెక్టర్ డాక్టర్ సుధ, రైతునేస్తం ఫౌండేషన్ చెర్మన్‌యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు నారాకోడూరు హైస్కూలు విద్యార్థుల ఎంపిక



నారాకోడూరు(చేబ్రోలు): తిరుపతిలో మే ఒకటో తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టులో నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు బాలురు, ఎనిమిది బాలికలు స్థానం సాధించారు. బాలుర జట్టులో కె. డేవిడ్ రాజు, టి. శివశంకర్, ఎ. రాఘవేంద్రరావు, బాలిక విభాగంలో ఎస్. అలేఖ్య, పి. దేవి, కె. వెన్నెల, డి. ఎరూష, టి. పవిత్ర, కె. శ్రీజ, పి. మౌనిక, కె. ప్రసన్న కుమారి పాల్గొననున్నట్లు పీఈటీ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల్ని హెచ్‌ఎం వేణుగోపాలరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంకమ్మరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న పాలనపై ప్రజలంతా సంతోషం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రజలంతా మరోసారి జగనన్న సంక్షేమ పాలన కోసం ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ‘మా నమ్మకం జగనన్నే, మా భవిష్యత్తు జగనన్నే’ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.45 కోట్ల కుటుంబాల్ని వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు కలసి వారినుంచి అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. అందులో 1.10 కోట్ల మంది జగనన్నకు మద్దతుగా, ఆయన సంక్షేమ పాలన మరలా మరోసారి కావాలని మిస్డ్ కాల్స్ చేసినట్లు వెల్లడించారు. ఇంతటి ప్రజాదరణ పొందిన ప్రజా నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పిన సంక్షేమ పథకాలు 99శాతం అమలు చేసిన ఘనత మనత ఆయనకే దక్కిందని చెప్పారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 85 శాతం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగిందని,



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత

అందులో 60 శాతం ప్రజలు జగనన్నకు మద్దతుగా మిస్డ్ కాల్స్ చేశారని సుచరిత తెలిపారు. చంద్రబాబు గత ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. మరలా ప్రజలకు ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసేందుకు, నిత్యం అబద్ధాలు చెబుతున్నాడని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా జగనన్నకు మద్దతుగా ఉండి, ఆయన సంక్షేమ పాలను మరలా పొందేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ల అక్రమాలు ప్రజలందరికీ తెలుసు..

- క్వారీ తవ్వకాలపై బహిరంగ చర్చకు సిద్ధమా ?
- విలేకర్ల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్

చేబ్రోలు: టీడీపీ ప్రభుత్వ పాలనలో సంగం డెయిరీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రం కుమార్, అతని అనుచరులు ప్రభుత్వ భూముల్లో అక్రమ క్వారీయింగ్ చేయలేదని వడ్లమూడిలోని క్వారీ దేవాలయంలో ప్రమాణం చేయాలని చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు, చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలపై చేసిన వ్యాఖ్యల్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జీడీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్, కాసు ఈశ్వరరెడ్డి, చేబ్రోలు, మంచాల గ్రామ సర్పంచులు అత్తోట వినీతారాణి, చందు బాబు తదితరులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ కాలంలో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, అతని సోదరుడు సురేంద్రలతో పాటు టీడీపీ నేతలు శేకూరు, వీరనాయకునిపాలెం, సుద్దపల్లి, చేబ్రోలు, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల్లో 500 ఎకరాల్లో అక్రమ క్వారీయింగ్ పాల్పడ్డారని ఆరోపించారు. నీరు –చెట్టు పేరుతో ప్రతి గ్రామంలో తవ్వకాలు చేసి కోట్ల రూపాయిలు స్వాహా చేసినట్లు విమర్శించారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన పోతురాజు మాట్లాడుతూ టీడీపీ పాలనలో 450 ఎకరాల్లో తవ్వకాలు చేశారని, వాటిని అప్పు ప్రతిపక్షనేతగా ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమ గ్రామానికి వచ్చి అడ్డుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్క సెంటు భూమిలో కూడా క్వారీయింగ్ జరగలేదని తెలిపారు. వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చేబ్రోలులోని ఏడున్నర ఎకరాల్లోని ముత్యాలమ్మ గుంటను టీడీపీ నేతలు క్వారీయింగ్ చేసుకొని కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. స్థానిక చెరువుల్లో నరేంద్ర, సురేంద్రలు సీసీ కెమెరాలు పెట్టుకొని అక్రమ క్వారీయింగ్ చేశారని, అడ్డుకున్నవారిపై తప్పుడు కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. దురాక్రమణలకు పాల్పడిన నరేంద్ర నేడు నీతులు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. శలపాడు గ్రామానికి చెందిన బాలచంద్రయ్య మాట్లాడుతూ గ్రామంలోని మూడు చెరువులను అక్రమంగా తవ్వకాలు చేసి కోట్ల రూపాయిలు ప్రజాధనాన్ని దోచుకున్నారని తెలిపారు. కుమ్మరి చెరువు అడ్డుకోవటానికి ప్రయత్నించిన వారిపై హత్యాయత్నం చేయటానికి ప్రయత్నించటంతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. వేజండ్ల గ్రామానికి చెందిన కాసు ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని దేవళ్ల చెరువును టీడీపీ నేతలు తవ్వుకున్నారని, రైల్వే భూములు, జడ్పీ భూముల్లో అక్రమ క్వారీయింగ్ చేశారని, నీరు–చెట్టు పేరుతో రూ.150 కోట్లు దోచుకున్నారని తెలిపారు. వీరి చేసిన తవ్వకాల వల్ల ఇరువురు పిల్లలు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గొడవర్రుకు చెందిన ఆరాధ్యుల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని టీడీపీ నేతలు 30 ఎకరాల్లో నీరు –చెట్టు పేరుతో రూ.10 కోట్ల మేర దోచుకున్నారని విమర్శించారు. సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ చిన్న గ్రామాలైన మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం గ్రామాల్లోను టీడీపీ నేతలు జన్మభూమి కమిటీలపేరుతో అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడి దోచుకున్నారన్నారు. జీడీసీఎం డైరక్టర్ కుర్రా పాములు, ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి భర్త కొక్కిలగడ్డ కిరణ్‌లు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేబ్రోలు మండలంలో 35 ఎకరాల్లో మాత్రమే అన్ని అనుమతులతో క్వారీయింగ్ జరిగినట్లు వివరించారు. రైల్వే లైన్‌కు, జగనన్న కాలనీలకు మాత్రమే అనుమతులతో గ్రావెల్ తరలించినట్లు తెలిపారు. టీడీపీ కాలంలో జరిగిన 500 ఎకరాల్లోని అక్రమ క్వారీయింగ్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అంటగడ్డటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యలను విమర్శిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి. అప్పిరెడ్డి, శివయ్య, పెదమస్తాన్, అహ్మద్ మన్నెం వేణు, వై. మమత, కె. మాణిక్యమ్మ, శ్రీరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, పార్టీ నాయకులు

కన్నుల పండువగా సీతమ్మ వారి జయంతి



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో శనివారం శ్రీ రామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్ రావు దంపతుల నిర్వహణలో శనివారం సీతమ్మ వారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ఆలయ పూజారులు వేదమంత్రాల నడుమ లక్ష మల్లెలార్చన, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజల్ని జరిపారు. మహా హారతి అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్ని కె.వి. సుబ్బారావు, అక్కిశెట్టి బాబూరావు పర్యవేక్షించారు.

WANTED TEACHERS
(With fluency in English)
for TINY TOTS SCHOOL
Brundavan Gardens, Ph: 0863 - 2235129, 9491475531
for TINY TOTS SCHOOL
Inner Ring Road, Ph: 8332834129, 9949140446
Salary : 15K - 20K for qualified teachers.
Interview : May 1st & 2nd (10.a.m - 3.p.m)
at TINY TOTS SCHOOL
4th lane Brundavan Gardens, Guntur.

ప్రజా వ్యతిరేక బీజేపీని సాగనంపాలి

పెదకాకాని: ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరిలో భాగంగా శనివారం నేతలు పెదకాకానిలో పర్యటించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువులు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, పోస్టల్, రైల్వే, టెలికాం, గనులు, ఓడ రేవులు, విశాఖ స్టీల్ ప్లాంట్లను ప్రైవేటీకరించి, అదానీ లాంటి వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా పోరాటాల ద్వారా మతోన్మాద బీజేపీ విధానాల్ని తిప్పి కొట్టాలని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ, పోలవరం, రాజధాని నిధులు.. ఇలా ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, కార్యవర్గ సభ్యులు ఎం. సాంబయ్య, రమేష్, బి. బాబూరావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రచారభేరిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

రేటూరు సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం



రేటూరు(కాకుమాను): మండలంలోని రేటూరు సొసైటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన వల్లూరి పండు శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ రాజేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వల్లూరి పండు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల్ని సకాలంలో అందించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరితకు రుణపడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మాజీ చైర్మన్లు చిరంజీవి, శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ షేక్ సైదా, అప్పాపురం సర్పంచ్ పొందుగుల ఆచారి, సొసైటీ డైరెక్టర్ లింగయ్య, గేరా పున్నారావు, గ్రామ ఉపాధ్యక్షుడు వల్లూరి సుధాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వల్లూరి చిట్టిబాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com